క్లుప్తంగా

కంప్యూటర్ అందజేత



కంప్యూటర్ అందజేస్తున్న దృశ్యం

పెద్దశంకరంపేట(మెదక్): స్థానిక సరస్వతీ శిశు మందిర్‌కు రూ.25 వేల విలువైన కంప్యూటర్‌ను పాఠశాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, క్రాంతిలాల్ ప్రధానోపాధ్యాయుడు వీరప్పకు అందజేశారు. విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో శ్రావణ్‌కుమార్, కృష్ణమూర్తి, సతీష్‌గౌడ్, రవివర్మ, శైలేష్ తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటిన ఎక్సైజ్ అధికారులు



కూచారంలో ఈత మొక్కలు నాటుతున్న అధికారులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలో వన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రవీందర్, ఎక్సైజ్ ఎస్‌ఐ అజీజ్ అహ్మద్ అన్నారు. శుక్రవారం మనోహరాబాద్ మండలం కూచారంలో చెరువుకట్ట వద్ద వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడసంఘం సభ్యులు 200 ఈత మొక్కలను నాటినట్లు తెలిపారు. మొక్కలు నాటడంతో పాటు సంరక్షించాలని సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల పంపిణీ



రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న గిర్దావర్

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని బూర్గుపల్లిలో శుక్రవారం రేషన్ కార్డులను గిర్దావర్ ఆబేద్ పంపిణీ చేశారు. అర్హులందరికి కార్డులను ఆందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు సాయిబాబ, సిద్ధగిరి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులు అందచేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: నర్సాపూర్, శివ్వంపేట, కౌడిపల్లి, కొల్చారం మండలాలకు చెందిన పలువురు లబ్దిదారులకు ఎమ్మెల్యే సునీతారెడ్డి సీఎంఆర్ ఎఫ్ చెక్కులు అందజేశారు. ఆమె వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, నయీం, ఎల్లం, జనార్ధన్ తదితరులు ఉన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలు ప్రారంభం

మునిపల్లి(అందోల్): ఓపెన్ స్కూల్ ప్రవేశాలు ప్రారంభమయ్యాయని ఎంఈఓ భీంసింగ్ శుక్రవారం తెలిపారు. 2025–26 ఏడాదికి సంబంధించి 14 ఏండ్లు నిండిన విద్యార్థులు పదో తరగతిలో ప్రవేశం పొందేందుకు అవకాశం ఉందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి కనీస వయస్సు 15 ఏండ్లు ఉండాలన్నారు. పదో తరగతికి ఫీజు రూ.1,150, ఇంటర్మీడియట్‌కు రూ.1,500 రుసుం కట్టాల్సి ఉంటుందన్నారు. మునిపల్లి, కంకోల్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఈ నెల 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్, రికార్డ్ షీట్, లేటెస్ట్ పాస్ ఫొటోలతో దరఖాస్తు ఫారానికి జతచేయాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శాంతినగర్‌లో గల సంతోషిమాత ఆలయ వార్షికోత్సవాన్ని ఈనెల 9న నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 7 గంటలకు అమ్మవారికి అభిషేకం, 10 గంటలకు సామూహిక కుంకుమార్చన, 11 గంటలకు పల్లకీసేవ ఊరేగింపు, మధ్యాహ్నం 12.10 గంటలకు డోలారోహణం, 12.30 గంటలకు మహా మంగళ హారతి, లలితా సహస్రనామ పారాయణ, అన్నదానం ఉంటుందన్నారు. రాత్రి 9 గంటలకు భజన ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

వైభవంగా వరలక్ష్మి వ్రతాలు

శ్రావణమాసం మూడవ శుక్రవారాన్ని పురస్కరించుకొని జిల్లాలో వరలక్ష్మి వ్రతాలు వైభవంగా జరిగాయి. మహిళలు తమ ఇళ్ల వద్ద వరలక్ష్మి పూజలు నిర్వహించి, వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు.



మెదక్ మున్సిపాలిటీ: సరస్వతీ శిశుమందిర్‌లో జరిగిన సామూహిక వరలక్ష్మి వ్రతాలు



పెద్దశంకరంపేటలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు



చిలప్‌చెడ్: జగ్గంపేటలోని వరలక్ష్మి వ్రతం చేస్తున్న మహిళలు



కౌడిపల్లి: ధర్మాసాగర్‌లో వరలక్ష్మి వత్రం పూజలు చేస్తున్న మహిళలు



రామాయంపేట మహంకాళీ మాత ఆలయంలో కుంకుమపూజ కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు

రెండేళ్లుగా నిలిచిన పనులు



అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు భవనం

- బిల్లులు రాకపోవడమే కారణం
- భవన నిర్మాణ పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్
- మార్కెట్ యార్డు లేక జనం ఇబ్బందులు

నర్సాపూర్: భవనం నిర్మించిన మేరకు బిల్లులు రాకపోవడంతో సుమారు రెండేళ్ల క్రితం నిర్మాణ పనులు నిలిపివేశారు. సుమారు రూ.4 కోట్లతో నర్సాపూర్‌లో ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజిటేరియన్ మార్కెట్ యార్డు భవన నిర్మాణ పనులు ఐదేళ్ల క్రితం చేపట్టారు. కాగా రెండు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణ పనులు పూర్తి చేయగా కాంట్రాక్టరుకు ప్రభుత్వం రూ.80 లక్షలు మంజూరయ్యాయి. మిగిలిన కోటి 20లక్షల రూపాయల బిల్లులు రానందున కాంట్రాక్టర్ రెండేళ్ల క్రితం భవనం నిర్మాణ పనులు నిలిపివేశారు. దీంతో మార్కెట్ యార్డు భవనం అసంపూర్తిగా ఉంది.

మార్కెట్‌యార్డు లేక ఇబ్బందులు

మటన్ మార్కెట్, చేపల మార్కెట్, కూరగాయల మార్కెట్ యార్డులకు భవనాలు లేకపోవడంతో ప్రజలు, వ్యాపారులు ఇబ్బందుల పాలవుతున్నారు. యార్డు లేనందున పట్టణంలోని పలు రోడ్లు, మురికి కాల్వల పక్కన కూరగాయలు, చేపల దుకాణాలు పెట్టి విక్రయిస్తున్నారు. వర్షం కురిసినప్పుడు తమ దుకాణాలు మూసి వేయాల్సి వస్తుందని, సరిగా వ్యాపారం నడవక కూరగాయలు అమ్మలేక పోతున్నామని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయల దుకాణాలు మూసి వేయడంతో ప్రజలు సైతం తమకు అవసరం ఉన్న కూరగాయలు కొనుగోలు చేయలేకపోతున్నారు. వ్యాపారులు, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మార్కెట్ యార్డు భవనం నిర్మాణం వెంటనే పూర్తి చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

బిల్లులు రానందునే..



ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డు భవన నిర్మాణం పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు పూర్తి స్థాయిలో బిల్లులు రానందున పనులు నిలిపివేసినట్లు తెలిసింది. తాను ఇక్కడ బాధ్యతలు చేపట్టక ముందే పనులు నిలిపివేశారు. జిల్లాలో ఇతర మున్సిపాలిటీలలో సైతం ఇదే పరిస్థితులు ఉన్నాయి. అసంపూర్తి భవనాల వివరాలు గతంలో తమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయారు. పట్టణంలో అసంపూర్తిగా ఉన్న భవనాల వివరాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి నిర్మాణం పూర్తి చేయించేందుకు కృషి చేస్తా.

–శ్రీరాంచరణ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

అధికంగా యూరియా వాడితే అనర్థమే

- వ్యవసాయ అధికారి రాంప్రసాద్
- ఎరువుల వాడకంపై అవగాహన



ఎరువులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండలంలోని మల్కాపూర్‌లో ఎరువుల వాడకంపై మండలం వ్యవసాయ అధికారి రాంప్రసాద్ శుక్రవారం అవగాహన కల్పించారు. గ్రామంలో వరి, పత్తి క్షేత్రాలను పరిశీలించి వరి పంటల సాగు విధానంపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికంగా యూరియా వాడితే అనర్థమేనని సాధ్యమైనంత వరకు రసాయనిక ఎరువులను తక్కువగా వినియోగించుకోవాలని, యూరియా వాడకం వల్ల పైరుకు లాభం కంటే నష్టమే ఎక్కువ జరుగుతుందని వివరించారు. పైరుకు వాడిన యూరియాలో మొక్కలు కేవలం 30 నుంచి 35 శాతమే వినియోగించుకుంటాయని, మిగతా అంతా వృథాగా పోతుందని తద్వారా చీడల నివారణకు అధిక ఖర్చును రైతు భరించాల్సి వస్తుందన్నారు. గుళికల మందు కలిపి వాడొద్దని చాలా మంది రైతులు మొదటగా దుక్కిలో వేసే యూరియాతో పాటు 4 నుంచి 5 కిలోల గుళికల మందును కలిపి వాడుతున్నారని చెప్పారు. పత్తిలో అయితే పెనుబంక, పచ్చదోమ, తెల్ల దోమ వంటి పురుగుల ఉధృతి ఎక్కువగ ఉంటే సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని కోరారు. ఇందులో వ్యవసాయ విస్తరణ అధికారి ఇంద్రయ్య, రైతులు పాల్గొన్నారు.

తుక్యా తండా రోడ్డు అధ్వానం



తారు లేచిపోయి అధ్వానంగా మారిన రహదారి

కొల్చారం(నర్సాపూర్): మారుమూల గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధికి రహదారులే మూల స్తంభాలు.అలాంటి రహదారుల నిర్మాణ సమయంలో నాణ్యతకు తిలోదకాలు ఇవ్వడంతో పది కాలాల పాటు మన్నికగా ఉండాల్సిన రహదారులు ఛిద్రమవడంతో ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ఫోటోలో పూర్తిగా తారు లేచిపోయి నల్లటి ఇసుకగా కనిపిస్తూ మట్టి రోడ్డును తలపిస్తున్న రహదారి. వసురాం తాండ గ్రామపంచాయతీ పరిధిలోని వరిగుంతం జెడ్పీ రోడ్డు నుంచి తుక్యాతండా మీదుగా కౌడిపల్లి మండలం దేవులపల్లికి వెళ్లే రహదారి ఇది. 2016లో గ్రామీణ రహదారుల అభివృద్ధి పథకం ద్వారా నిర్మించారు. రహదారి రెండున్నర కిలోమీటర్ల మేర ఇదే పరిస్థితి.

నూతన కమిటీ ఎన్నిక

కొండాపూర్(సంగారెడ్డి): గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా గ్రామపంచాయతీ యూనియన్ కార్యదర్శి దశరత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ మండల అధ్యక్షుడిగా వెంకయ్య, ఉపాధ్యక్షుడిగా సంజీవులు, కార్యదర్శిగా విజేందర్, సహాయ కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా రవి ఎన్నికయ్యారు.

పౌరసరఫరాల గోడౌన్ తనిఖీ చేసిన విజిలెన్స్

నారాయణఖేడ్: ఖేడ్ మండలంలోని జూకల్ శివారులో ఉన్న పౌరసరఫరాల గోడౌన్‌ను విజిలెన్స్ అధికారులు శుక్రవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ పండరి, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సాంబశివరావు, తహసీల్దార్ ప్రభాకర్‌లు పౌర సరఫరాల గోడౌన్‌లో నిల్వ ఉన్న బియ్యం వివరాలతో పాటు పాఠశాలలు, హాస్టళ్లకు, చౌక ధరల దుకాణాలకు సరఫరాల చేసిన రికార్డులను పరిశీలించారు. కాగా, ఖేడ్ పౌరసరఫరాల గోడౌన్ ఇన్‌చార్జ్‌గా శ్రీనివాస్ నియమితులయ్యారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న హరిబాబు బదిలీ అయ్యారు.

రైతులకు యూరియా, ఎరువుల పంపిణీ



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న ఏడీఏ భిక్షపతి

జహీరాబాద్: రైతులు యూరియా, ఎరువుల కోసం ఆందోళన చెందవద్దని, అవసరం మేరకు సరఫరా చేయనున్నట్లు ఏడీఏ భిక్షపతి అన్నారు. శుక్రవారం మొగుడంపల్లి మండలంలోని ఇప్పపల్లి పీఏసీఎస్‌లో రైతులకు యూరియా, ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిమాండ్ ఆధారంగా ఎరువులను దిగుమతి చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మచ్చేందర్, ఏఓ లావణ్య, ఏఈఓలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

మనోహరాబాద్(తూప్రాన్): సీఎంఆర్‌ఎఫ్ కింద వచ్చిన రూ 21 వేల చెక్కును బీజేపీ నాయకులు లబ్ధిదారుడికి శుక్రవారం అందజేశారు. మండలంలోని కాళ్లకల్ గ్రామానికి చెందిన నిర్మలకు మాజీ సర్పంచ్ మల్లేశ్ తెలిపారు. వీరి వెంట మాజీ ఎంపీటీసీ లావణ్య, జిల్లా బీజేపీ కౌన్సిల్ మెంబర్ కమ్మరి నరేందర్‌చారి, నాగరాజు పాల్గొన్నారు.

◆ ఓటరు జాబితా ఆన్‌లైన్

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో ఓటరు జాబితాను ఆన్‌లైన్ చేపడుతున్నారు. శుక్రవారం ఆయా గ్రామపంచాయతీల పరిధిలో వార్డుల వారీగా ఓటరు జాబితాను గ్రామకార్యదర్శులు ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. వార్డుల వారిగా ఇప్పటి వరకు జరిగిన మార్పులు, చేర్పులను ఆన్‌లైన్ చేపట్టారు. త్వరలో జరిగే పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితాను తయారు చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్‌అలీ, ఇన్‌చార్జి ఎంపీఓ జాకీర్ హుస్సేన్‌లు పర్యవేక్షించారు.

◆ అంబేద్కర్ ఆశయసాధనకు కృషి

నారాయణఖేడ్: అంబేద్కర్ ఆశయసాధనకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కార్యదర్శి అనుముల తుకారాం అన్నారు. ఖేడ్ మండలంలోని మాద్వార్‌లో శుక్రవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు.

◆ నైపుణ్యాభివృద్ధితో ఉపాధికి బాటలు

పటాన్‌చెరు: నైపుణ్యాభివృద్ధితో పాటు ఆచరణాత్మక పారిశ్రామిక శిక్షణతో మంచి ఉపాధి అవకాశాలను పొందవచ్చని కేంద్ర ప్రభుత్వ అధికారులు వెల్లడించారు. మండలంలోని రుద్రారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని కెరీర్ గైడెన్స్ కేంద్రం, ఫుడ్ ఇండస్ట్రీ కెపాసిటీ అండ్ స్కిల్ ఇనిషియేటివ్ సహకారంతో శుక్రవారం అప్రెంటిస్ షిప్ అవగాహన వర్క్ షాప్ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆర్డీఎస్డీఈ అధికారి వీవీ సతీష్ రెడ్డి జాతీయ అప్రెంటిస్ షిప్ శిక్షణ పథకం వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మండల ప్రత్యేకాధికారి దేవకుమార్



కల్వకుంటలో నర్సరీలను పరిశీలిస్తున్న దేవకుమార్

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో శుక్రవారం పారిశుద్ధ్య నిర్వహణ, అంగన్‌వాడీల పనితీరును మండల ప్రత్యేక అధికారి దేవ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో నిల్వ నీటిని తొలగించాలని, లేకుంటే దోమలు వాటి సంతతిని పెంచుకొని మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలను చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. గ్రామ నర్సరీని పరిశీలించి రైతులకు, ఇంటి అవసరాల కోసం మొక్కలను అందజేసి నాటే విధంగా అవగాహన కల్పించాలని, గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి డ్రై డేను పకడ్బందీగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందుతున్న విద్యా, సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్‌నారాయణ, మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి, కార్యదర్శి కవిత తదితరులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

గద్దెపై నుంచి కింద పడిన ట్రాన్స్‌ఫార్మర్



శ్రీరాంనగర్‌కాలనీలో కింద పడిన ట్రాన్స్‌ఫార్మర్

నర్సాపూర్: భారీ వర్షానికి కరెంటు స్తంభం పక్కకు ఒరగడంతో ట్రాన్స్‌ఫార్మర్ గద్దెపై నుంచి కింద పడింది. దీంతో పెనుప్రమాదం తప్పింది. నర్సాపూర్‌లోని శ్రీరాంనగర్ కాలనీలో ఇటీవల మురికి కాలువ నిర్మించారు. కరెంటు స్తంభాన్ని ఆనుకొని మురికి కాలువ కట్టేందుకు మట్టి తవ్వారు. మురికి కాలువ నిర్మించిన తర్వాత స్తంభానికి మురికి కాలువకు మధ్య గుంతలో మట్టి నింపకుండా అలాగే వదిలేశారు. స్తంభం పక్క నుంచి గుంత ఉండటంతో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కరెంటు స్తంభం పక్కన మట్టి లేకపోవడంతో దానికి సపోర్టు లేక ఒక పక్కకు ఒరిగింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్ లీకై కింద పోయింది. కాగా ట్రాన్స్‌ఫార్మర్ కింద పడడంతో గురువారం రాత్రి నుంచి కాలనీలో కరెంటు సరఫరా నిలిచిపోయింది. ఈ విషయమై ఏడీఈ రమణారెడ్డిని వివరణ కోరగా.. గద్దెపై నుంచి ట్రాన్స్‌ఫార్మర్ కింద పడినందున మరో ట్రాన్స్‌ఫార్మర్ బిగించామని చెప్పారు. మురికి కాలువ నిర్మించిన అనంతరం గుంతలో మట్టి నింపి ఉంటే ప్రమాదం జరిగేది కాదన్నారు.

బీజేపీ నేతల ఆమరణ దీక్ష

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్



ఆమరణ దీక్షలో పాల్గొన్న నాయకులు

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం మండలానికి డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని కోరుతూ బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కృష్ణ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ప్రభుత్వం ఈ విషయమై వెంటనే చర్యలు తీసుకోవాలని, ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భాస్కర్, మండల ప్రధాన కార్యదర్శి రాములు, జైపాల్, నీలి రమేష్, సాయి, బాలరాజు, గణేష్ నాయక్, మహేష్, శివ, శ్రీకాంత్, బస్వరాజ్, లక్ష్మణ్ టేక్మాల్ మండల అధ్యక్షుడు శంకర్, దళిత మోర్చా అధ్యక్షులు కృష్ణ, ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ నాయక్, ప్రధాన కార్యదర్శి మదన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ అనంతరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి పీఏసీఎస్ కార్యాలయంలో వానాకాలం పంటలకు సంబంధించి రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సొసైటీ కార్యాలయంలో శుక్రవారం అర్ధ వార్షిక మహా జనసభ నిర్వహించారు. నాలుగు నెలల కాలానికి సంబంధించి జమ, ఖర్చుల పట్టిక, 2024–25 సంవత్సరపు ఆడిట్ రిపోర్టు ఆమోదించడంతో పాటు త్వరలో చేపట్టబోయే పనులపై చర్చించారు. కార్యక్రమంలో సీఈఓ అశోక్, డైరెక్టర్లు నర్సింహులు, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి

ఎంపీడీఓ ప్రశాంత్



చిట్కుల్‌లో నిల్వ నీటిని పారబోయిస్తున్న ఎంపీడీఓ ప్రశాంత్, తదితరులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రతి పౌరుడు తమ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని ఎంపీడీఓ ప్రశాంత్ అన్నారు. శుక్రవారం ఆయన చిలప్‌చెడ్ మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం సీజన్‌లో ఇంట్లో ఉన్న డ్రమ్ములు, టైర్లు, పాడేసిన కొబ్బరిబొండాలు, ఖాళీ సీసాలు, పాడైన కూలర్లలలో నీటి నిల్వ అయ్యేందుకు అవకాశం ఉంటుందని, ఆ నీటిని ఎప్పటికప్పుడు పారబోయాలన్నారు. తద్వారా దోమలు, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉంటారన్నారు. మురికి కాలువల్లో బ్లీచింగ్, మురికి గుంటల్లో ఆయిల్‌బాల్స్ వేయించాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇంటి పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

రాఖీలు కట్టిన చిన్నారులు

జిల్లాలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు ముందస్తు రక్షాబంధన్ కార్యక్రమం జరుపుకొన్నారు. బాలికలు బాలురకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు చెప్పారు.



నిజాంపేట: రాఖీ కట్టుకుంటున్న విద్యార్థులు



చేగుంట: కృష్ణవేణి పాఠశాలలో రక్షాబంధన్ జరుపుకుంటున్న విద్యార్థులు



సదాశివపేటలోని శాంతినికేతన్ పాఠశాలలో శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యార్థులు



కౌడిపల్లి: అంగన్‌వాడీ కేంద్రంలో రాఖీలు కట్టుకున్న చిన్నారులు